కాసేపటికి "అన్నం వడ్డించాను రండి" అన్న పిలుపుతో అన్నంముందుకొచ్చి కూర్చున్నాడు రాధాకృష్ణ. "కూరలు ఏమీ చేయలేదా?" అన్నాడు.

"ఊహుఁ."

"మరి పులుసుగాని, పప్పుగానీ..."

"ఊహుఁ! ఏదీ చేయలేదు."

"అయితే ఈ అన్నం నాకక్కరలేదు" అంటూ కలుపుతూ ఉన్న అన్నాన్నొదిలేసి వెళ్ళిపోయేడు రాధాకృష్ణ. భర్త ప్రవర్తన చూచి ఆశ్చర్యపోయింది శకుంతల. యిదివరకెప్పుడూ యిలా జరుగలేదు. ఈసారి ఆయనకు నిజంగానే కోపం వచ్చినట్లుంది. అయినా తనే తప్పుచేసింది. కూరగాయలు యింట్లో వున్నా బద్ధకంతో ఏమీ వండలేదు. పగలల్లా ఆఫీసులో పనిచేసి ఒట్టి అన్నం పచ్చళ్ళు తినమంటే ఎవరికైనా ఎట్లా వుంటుంది? ఎంతకష్టం?" అని తనలో తానే తర్కించుకొన్నది.

"అన్నానికి లేవండి" అన్నది శకుంతల బ్రతిమాలుతున్న ధోరణిలో.

"నాకేం అక్కర్లేదు నువ్వేతిను ఆపచ్చళ్ళతో అన్నం" కోపంగా అన్నాడు రాధాకృష్ణ.

"ఈ ఒక్కసారికే క్షమించండి బద్ధకంతో ఏమీ చేయలేదు"

"అందుకే నువ్వొక్కదానివే తిను. నాకేం అక్కర్లేదు. నే నెట్లాపోతే నీకేం?"

"అదేమిటండీ ఆమాటలూ? క్షమించమంటినిగా లేవకపోతే నామీద ఒట్టే" అన్నది కన్నీళ్ళతో.

ఇక ఆలస్యం చేయకూడదనుకుని "సరే పద" అని అన్నాడు రాధాకృష్ణ పైకి కనబడని లోపలి ఆనందంతో.

కథానిక

# తీరిన కోరిక

## వడ్లపట్ల దయానందం

గెరట్రాజు స్కూలుఫైనలు రెండోసారితప్పడమూ, జానకిఇంటర్ పాస్ కావడమూ ఒకేసారిజరిగినై.

కుమారి జానకిని, ఇంటర్‌లో కాలిడేముందు—చిరంజీవి గెరట్రాజు—ఇరుపక్షాల పెద్దల సమ్మతి మీద, పలువురు పెద్దలసమక్షంలో, పురోహితులు మంత్రపఠన కావిస్తూండగా, శాస్త్రోక్తంగా, సూత్రబంధన మొనర్చి, శ్రీమతిగా మార్చడంవల్లే అసలు చిక్కు ఉత్పన్నమయింది.

రిజల్ట్సు బయటబడ్డ మరుక్షణంలోనే- మూడోసారి మళ్ళా హైస్కూలులోనే చేరి, స్కూలు ఫైనలు చదువ, నిర్ణయించుకోడానికి గెరట్రాజుకు ఏ అభ్యంతరమూ లేకపోయింది. మీదుమిక్కిలి జానకి సైతం సుముఖతనే వెల్లడించింది. కాని ఎటొచ్చీ బి. ఏ, కూడా పూర్తిచేదామనుకున్న జానకికే, పెద్ద చిక్కడ్డొచ్చి తనకీ, చదువుకీ మధ్య అడ్డుగోడలా నిలచింది.

అసలు గెరట్రాజుకున్న యాభై ఎకరాల సుక్షేత్రమైన మాగాణీయే కేవలం ఆ పిల్లమెడలో గెరట్రాజుచేత మూడుముళ్ళూ వేయించడానికి దోహదకారయిందన్నది ఊబుసుపోసినవారి విమర్శ. అది విశ్వసించడానికి బలమైన ఆధారాలంతగా లభించవు.

ఒకే క్లాసు కాకపోయినా, స్వకులస్థుడు. అందులోనూ, ఒకవిధంగా చాలా దూరపుబంధువు కావడం వల్ల స్కూలుఫైనలు చదువుతున్న జానకి మనసు మూడుసంవత్సరాల క్రితం ఫెష్టుఫారం చదువుతున్న గెరట్రాజువైపునకు ఓ సుభసమయాన మరలిందన్నది యదార్థం. తీరా మరలినతరువాత, కళ్ళెంబిగించి, మనసును దిట్టపరచుకోబోయిందికాని, అది వ్యర్థప్రయత్నంగానే వేగిపోయింది.

ఎర్రగా చక్కగా ఆ కోలముఖం కొట్టొచ్చినట్లుండే ముక్కు, చిలిపిగాచూచే ఆ కళ్లు జానకిని ప్రచండవేగంతో తమవైపు లాక్కున్నయ్.

ఎన్నోసార్లు—"ఛ!... నేను చూస్తూన్నది తప్పేమో" అనుకుంది.

మళ్ళా అన్నిసార్లూ "అబ్బ...మరి చాలా బావున్నాడు, పైగా చక్కని ఆస్తి. మీదుమిక్కిలి దూరపుబంధువు కూడాను. పైగా, తను అతని అంత

స్తుకు సరితూగగలదు. అటువంటప్పుడు అతన్ని చేసుకోవడంలో తప్పేముంది"అని సరిపెట్టుకుంది.

గౌర్రాజుకు సైతం ఉద్దేశం లేకపోలేదు. స్కూల్లో జానకి ఎప్పుడు కనిపించినా చిరునవ్వు నవ్వేవాడు. వారగాచూచేవాడు. "ఆ కళ్ళు చాలా అందంగా ఉంటాయనుకునేవాడు. ఆ అధరాలు చక్కగా, సన్నగా, ఎర్రగా, మధ్యవంపుతిరిగి ఎంత ముద్దుగా ఉంటాయి. మొత్తంమీదీ పిల్ల చాలా బావుంటుంద"ని ఎన్నోసార్లు అనుకునేవాడు.

ఇదే ఉద్దేశ్యంతో గౌర్రాజు కూడా ఉండటంవల్ల ఒక విచిత్ర పరిస్థితిలో-తలవని తలంపుగా-పరిచయ మేర్పడింది.

ఓరోజున స్కూలునుండి పోతున్న జానకిని ఏవేవో కొంటెమాటలంటూ వెంబడిస్తూన్న ఒకానొక విలన్ని నిలేసి నాలుగు గుద్దులుగుద్ది, మూడు చెరువుల నీళ్ళు త్రాగించి, రొమ్మువిరిచి హీరో అయిన గౌర్రాజు, జానకిహృదయంలోని ప్రేమని, ప్రత్యంక్షంగా చూడగలిగేడు.

జానకి సైతం, గౌర్రాజు హృదయ కుహూరంలో గోప్యమై ఉన్న ప్రేమని స్పష్టంగా చూడగలిగింది. అప్పుడా రెండుహృదయాలలోని 'ప్రేమ' వరదటేరులా బయటపడి, రెండుహృదయాలూ కళ్ళతో చాలా క్షణాలు మాట్లాడుకొన్నై. అదే ప్రథమ పరిచయం. దరిమిలా నా పరిచయం స్నేహంగామారి ప్రేమరూపంలో వృద్ధిపొందుతూ పరిపక్వ దశకొచ్చింది.

జానకి స్కూలుఫైనలు పాస్అయి కాలేజీలో చేరబోయిన సంవత్సరమే గౌర్రాజు పిప్తుపారాన్ని అతికష్టంమీద గెంతి స్కూలుఫైనలు క్లాసు నలంకరించాడు. ఇరవై సంవత్సరాలు నిండుకున్న గౌర్రాజు... ఏ క్లాసునూ రెండుసంవత్సరాలకి తక్కువకాకుండా చూడలేదు. అందుకే స్కూలు ఫైనల్ లోకి వచ్చేసరికి ఇరవైయీ పూర్తయాయి.

బాగాచదువుకున్న వాడికిజానకినివ్వాలని సంకల్పించిన జానకి తలిదండ్రులు "చదువులో ఏముంది"అని తెగేసడిగిన జానకి సూటిప్రశ్నకులొంగకతప్పలేదు.

ఆడవాళ్ళ చదువువల్ల వరిగేదేమిటి — లక్షణమైన కట్నం వచ్చేది చూసుకోక" అన్న గౌర్రాజు తండ్రిని, "కట్నంలో ఏముంది నాన్నా... దానికాసించి పండంటి బ్రతుకును బూడిదపాలు చేసుకోమంటావా!"అంటూ ఉపన్యాస ధోరణిలో వరకట్న పిశాచ వికృతరూపాన్ని, పవిత్రప్రేమ నిజస్వరూపాన్ని తండ్రి కెరుక పరచి అంగీకరింపచేశాడు గౌర్రాజు.

వీళ్ళిద్దరి హృదయాలు, తదితరులకెలా తెలుస్తయ్- అందుకే పెళ్ళిలో కొన్ని నెరసిన తలలు చాటుగా గుసగుసలాడకపోలేదు. "పిల్ల ఎలాగైనా కాస్త వత్తరి-పిల్లాడు కొంచెం లొజ్జు...చదువులో కూడా తక్కువేనాయె. ఆ ఆస్థిని చూసికాని, లేకపోతే పిల్లాడు తగడు" అని.

ఇటు పిల్లకి, అటుపిల్లవాడికి, అతి సన్నిహితమైన పెద్దతలలు మాత్రం సమర్థించాయి. "ఆ... ఎంత...మహా ఉంటే ఒక బెత్తెడుంటుందేమో... మొన్నటిపిల్ల—కాళ్ళమీద ఎదిగింది కాని- రెండు కలిపితే పదహారు ఉండవ్" అని.

"ఊఁ—ఎన్ని జరగటంలేదు ... మా సుబ్బులు దాని మొగుడిమీద జానెడుంటుంది. కడవంత గుమ్మడికాయ కత్తిపీటకు లోకువన్న సామెత ఉన్నదేనయ్యో ... ఏ పొరుపులూ లేకుండా మా సుబ్బులు సంసారం సక్రమంగా దొర్లిపోవడంలా. ఏమిటో మనం అనుకుంటాంకాని" పెళ్ళికొడుకువైపు దగ్గరబంధు వొకామె సమర్థించింది.

వెంటనే పెళ్ళికూతురుతరఫు ముత్తయిదొకామె:

"అంతవరకెందుకు మా పళ్ళంరాజు, పెళ్ళాం వాడిమీద మూరెడుంటుంది. పెళ్ళినాడందరూ ఆక్షేపించినవాళ్ళే ... ఇప్పుడంతా ముక్కుమీద వేలేసుకోవడంలా? వాళ్ళఅన్యోన్యత చూచి"అంది.

మొత్తంమీదా పెళ్ళిలో మెజారిటీ జంటను సమర్థించింది. ఇదంతా మూడుసంవత్సరాల క్రితం నాటి పెళ్ళిముచ్చట.

ఇప్పుడు జానకికి పట్టినదుగ్ధ - భర్త తనకంటె బెత్తెడెత్తు తక్కువుంటాడనేకాదు. తిరిగి రెండో సారికూడా భర్తపరీక్ష పోయిందనేకాదు; తనెందుకు ఇంటర్ ప్యాస్ అయ్యానా — అన్నదే బాధంతా. పరీక్షపోతే పైచదువు ప్రశక్తే ఉండేది కాదు. అసలు పెళ్ళయిన క్రొత్తలోనే అత్తమామలు—అనగా గౌర్రాజు తలదండ్రులు కాలేజీ చదువుకు అభ్యంతరం పెట్టబోయారు. వారి ఏకైక గారాబుపట్టి గౌర్రాజు తనపక్షం కాబట్టి... అప్పట్లో ఇట్టే తనకోర్కెను సాధించుకోగల్గింది.

కాని ఇపుడు బి. ఎ. చదవటానికి ఆయనసైతం అంగీకరిస్తారో లేదో. అన్నదే జానకి బాధ.

"ఇంట్లో కూర్చుంటే ఏంతోస్తుంది. కనీసం కాలక్షేపం కోసమైనా ఈ సంవత్సరంకూడా చదువుతానన్న గెరట్రాజును 'అలాగే చదవండ'ని ఆరోజు ప్రొద్దుట ప్రోత్సాహపరచిన జానకి తన విషయం ఆయనే కదుపుతాడు గదా అని ఆశించింది. కాని అలా జరగక పోవడంలో వెంటనే నీరసించి అప్పటికప్పుడే తనకోర్కెను భర్త కెరుకపర్చ సాహసించలేక పోయింది.

మనసులో ఉన్న కోర్కెను విడుదలచేసి... దానిపై భర్తఉద్దేశాన్ని రాబట్టడానికి సుముహూర్త రాత్రికి నిశ్చయించుకుని ఆ పగలంతా అదే దిగులుతో మందమతిగా గడిపింది. అక్కడికీ ఆసాయంత్రంపూట అత్తమ్మ అడిగిందికూడా, "ఏవే జానకీ... పరీక్ష పాసైన నంతోషమన్నా లేకుండా అలా ఉన్నావ్... ఒంట్లో బావుండలేదా?" అని.

"అబ్బె ఏంలేదండత్తయ్యా, తలకాస్త నొప్పిగా ఉంది అంతే" అంది యదార్థాన్ని కప్పిపెడుతూ.

"అయ్యో-అదేమిటే, డబ్బీలో, అమృతాంజనం ఉండగా ఇలా పెరట్లో తలనొప్పితో చల్లగాలిలో కూర్చోవడమేమిటే ఆమాత్రమైనా తెలుసుకోపోతే ఎట్లా" అంటూ అమృతాంజనం బుడ్డీ తెచ్చి బలవంతాన అత్తమ్మ కణతలకు పట్టిస్తూంటే కాదనటానికి ఆస్కారంలేనిజానికి ఆ ఘాటుగా నిజంగానే కన్నీరు కార్చింది. అత్తమ్మ బలవంతంమీద మంచమెక్కక తప్పలేదు జానకికి. పరుండే ఆలోచిస్తోంది.

"తన కోర్కెల్లా ఒక్కటే బి. ఎ. కూడా చదవాలి. భర్త అంగీకరిస్తేచాలు. సదరు అంగీకారం లభిస్తుందో లేదో ఒకవేళ అంగీకరించదేమో అంగీకరించేవారైతే ఆయన సంగతి చెప్పినప్పుడు తన సంగతి సైతం ఎందుకెత్తి ఉండేవారుకాదు? తన్ని చదివించాలనుంటే "నే ఉద్దేశ్యమేమిటి జానకీ ఇంకా పైకి చదవాలనుందా!" అని ప్రొద్దుటే అడిగుండేవారు. ప్చ్! ఆయనకు చదివించాలనిలేదు. ఈ అనుమానం దృఢమవుతూన్నప్పడల్లా తనకి తెలియకుండానే కళ్ళవెంట నీళ్ళు, జల, జల, రాలుతున్నాయ్. ఆ కన్నీటితోపాటు ఆలోచనలుకూడా బిర, బిర, వస్తున్నాయ్.

ఆయనెందు కంగీకరించకూడదూ? తన చదువు ఇష్టంలేని వారైతే అసలు ఇంటర్ చదవటానికే ఒప్పుకోనుండేవారు కాదు. ఏమో ఆయనసైతం, స్కూలుఫైనలు రెండుసార్లు తప్పుతానని కలగన్నారా పాసై తనుకూడా కాలేజీలో చేరవచ్చునన్న ఉద్దేశ్యంతో అప్పుడంగీకరించారేమో మరి ఇప్పుడైతే ఎందుకొప్పుకుంటారు?

ఆలోచనలమధ్య కనురెప్పలు భారంగా మూతపడ్డాయ్. "జానకీవంట్లో బావుండలేదా" అంటూ గెరట్రాజు గదిలోకొచ్చి తన మంచంమీద కూర్చునే వఱకూ జానకికి తెలియనేలేదు. దిగ్గున లేచి కూర్చుని చిఱునవ్వు తెచ్చిపెట్టుకుంటూ "అబ్బె ఏంలేదు తలనొప్పని, అత్తమ్మగారితో చిన్న అబద్ధం ఆడిన ఫలితంగా ఇప్పుడు కణతలు మండుతున్నాయ్ అంతే" అంది గెరట్రాజు ముఖంలోకి చూచి నవ్వుతూ.

"అయితే పచ్చిఅబద్ధాలకోరువైపోతున్నావన్నమాట" రెండుచేతుల్తోను జానకిముఖాన్ని పెదవులకు దగ్గరసా లాక్కోబోతూ అన్నాడు గెరట్రాజు.

"ఏమండీ ఒక్కవిషయం అడగమంటారా" ముఖం కొద్దిగా వెనక్కి లాక్కుంటూ ఆశగా కళ్ళల్లోకి చూస్తూ అడిగింది జానకి.

"ఏమిటి" తిరిగి ప్రశ్నార్థకంగా చూచాడు జానకి కళ్ళల్లోకి.

"ఊహుఁ, మరేంలేదు బి.ఎ.లో ఎడ్మిటవుతా."

"నిన్నెవరు అభ్యంతర పెట్టారు?"

గెరెట్రాజు వేసినఎదురుప్రశ్న ఒక్కసారిగా జానకి హృదయాన్ని, ముఖాన్ని ఆనందంతో నింపేసింది. క్షణంలోకలిగిన ఆ మార్పునుగ్రహించిన గెరట్రాజు

"పిచ్చి పిల్లా ప్రొద్దుటినుంచీ ఈ అనుమానంతోనే బాధపడుతున్నావా?" అన్నాడు జానకి ముఖాన్ని అలా రెండు చేతులలోనూ ఉంచుకుని.

"మరి నా విషయం మీరెత్తనేలేదు."

"నా విషయం నీతో చెప్పుకున్నప్పుడు నీ విష నాతోచెప్పుకోవలసి బాధ్యత నీది...నువ్వే చెప్పాలిగాని నేనెవర్ని" అన్నాడు గెరట్రాజు దాదాపు జానకి పెదవుల్ని, తన పెదవుల దగ్గరకిచేర్చుకోబోతూ.

"మీరు చాలా మంచివారండీ" ఆనందంతో బరువెక్కిన కనురెప్పలు మూత పడుతూండగా అంది జానకి. నాలుగు పెదవులూ కలపిసై. ★